నేడు మూడో విడుత ఇండ్ల పంపిణీ

1327 మందికి డబుల్ బెడ్ రూం పట్టాలు అందజేత

అబిడ్స్, అక్టోబర్ 1 : గోషామహల్ నియోజకర్గానికి చెందిన 1327 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీ చేపట్టనున్నారు. ఇండ్లు లేని వారు డబుల్ బెడ్‌రూం ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు విచారణ చేపట్టి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారి జాబితాను సిద్ధం చేసిన విషయం విదితమే. ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు ఇప్పటికి రెండు సార్లు 500మంది చొప్పున లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి వారికి పట్టాలను పంపిణీ చేశారు. కాగా ఇటీవల మూడో విడుత పంపిణీలో భాగంగా డ్రా నిర్వహించి 1327 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారికి సోమవారం కొల్లూరులో డబుల్ బెడ్‌రూం ఇండ్ల పట్టాలను పంపిణీ చేసేందుకు గాను అధికారులు చర్యలు తీసుకున్నారు. సోమవారం కూడా లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను పంపిణీ చేయనున్నారు. జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం అధికారులు ఫోన్ ద్వారా సమాచారం అందించి సోమవారం ఉదయం బస్సులను ఆశ్రయించి పట్టాలను పొందేందుకు రావాలని కోరారు.

కొల్లూరుకు చేరుకునేందుకు 53 బస్సులు ..

గోషామహల్ నియోజకర్గానికి చెందిన అర్హులైన 1327మందికి కొల్లూరులో నిర్మించిన డబుల్ బెడ్ రూం సముదాయంలో పంపిణీ చేపట్టనున్నారు. లబ్ధిదారులు కొల్లూరుకు చేరుకునేందుకు గాను 53 బస్సులను ఏర్పాటు చేశారు. నిజాం కళాశాల మైదానం నుంచి సోమవారం ఉదయం 6 గంటలకు బస్సులు బయలు దేరి అక్కడకు చేరుకుంటాయి. అక్కడ అధికారులు వారికి కేటాయించిన పట్టాలను అందజేస్తారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసం ఎంపికైన వారు నిజాం కళాశాల మైదానానికి ఉదయం 6 గంటల వరకు చేరుకొని బస్సులను ఆశ్రయించాలని అధికారులు కోరారు.

కొల్లూరులోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల భవన సముదాయం

ముస్లింలు మిలాద్ ఉన్ నబీ పండుగను నాంపల్లిలో ఘనంగా జరుపుకున్నారు. నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్ ముస్లిం మతపెద్దలతో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
– మెహిదీపట్నం, అక్టోబర్ 1

ఎస్.ఎస్.కె.మ్యాక్ట్ సొసైటీ ఎన్నికలు

రహీంపురాలోని సొసైటీ ఎన్నికల్లో ఓటు వేసిన సభ్యులు

అబిడ్స్, అక్టోబర్ 1 : రహీంపురాలోని ఎస్.ఎస్.కె.సమాజ్ భవన్‌లో ఎస్.ఎస్.కె.మ్యాక్ట్ సొసైటీ ఎన్నికలు జరిగాయి. రెండేండ్లకు ఒకసారి జరిగే ఎన్నికలకు గాను ఆదివారం సమాజ్ భవన్‌లో నిర్వహించారు. మ్యాక్ట్ సొసైటీ సభ్యులు ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. ఇదిలా ఉండగా ఆదివారం జరిగిన ఎన్నికల్లో సొసైటీ డైరెక్టర్ మనోజ్ కుమార్ చవాన్, బీఆర్ఎస్ నాయకులు హెచ్.కుమార్, జ్ఞానేశ్వర్, పాండు షా, ముఖేశ్, రతన్ రాజేంద్ర, కాటిగర్ శంకర్‌రావు, శివ్‌రతన్, భరత్ చవాన్, జై ప్రకాశ్, గంబు నాగరాజు, చవాన్ అశోక్, బడేఖాన్ మహావీర్, రాజేశ్, డీసీ ధన్‌రాజ్, దగుడు వెంకటేశ్, తులసి, సురేశ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న టెలికమ్యూనికేషన్ తెలంగాణ సర్కిల్ కంట్రోలర్ అనిత

కోఠి ఆర్ఎఫ్‌పీటీసీ యూపీహెచ్‌సీ ఆవరణలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రెడ్డి

అబిడ్స్, అక్టోబర్ 1 : పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని టెలి కమ్యూనికేషన్ తెలంగాణ సర్కిల్ కంట్రోలర్ ఎం.అనిత అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర మంత్రిత్వ శాఖ ఆదేశానుసారం స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం నాంపల్లి కట్టెలమండిలోని ఆంధ్రా విద్యాలయ ఉన్నత పాఠశాలలో ' గార్బేజి ఫ్రీ ఇండియా ' నినాదంతో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న టెలి కమ్యూనికేషన్ తెలంగాణ సర్కిల్ కంట్రోలర్ ఎం.అనిత మాట్లాడుతూ.. ప్రతి సంస్థలో మూత్రశాలలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త చెదారం లేకుండా శుభ్ర పరచుకోవాలని సూచించారు. గ్లోబల్ వార్మింగ్‌ను నివారించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

రాబోయే తరం ఆరోగ్యంగా ఉండాలంటే..

టెలి కమ్యూనికేషన్ తెలంగాణ సర్కిల్ సహాయ కంట్రోలర్ సీఎం సంపర్ మాట్లాడుతూ.. చుట్టు పక్కల పరిసరాలను సంస్థల్లోని పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే రాబోయే తరం ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ ప్రతి సంస్థలో మూత్రశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆంధ్రా విద్యాలయ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్లా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛత కార్యమాన్ని తమ పాఠశాలలో నిర్వహించడం ఆనందంగా ఉందని, టెలి కమ్యూనికేషన్ తెలంగాణ సర్కిల్ అధికారులను కొనియాడారు. ఈ సందర్భంగా కంట్రోలర్ ఎం.అనిత పాఠశాలలో మొక్కలను నాటి పాఠశాల లోపల పాఠశాల బయట చుట్టుపక్కల పరిసరాలను తమ తోటి సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. స్కూల్ బయట కూడా శుభ్రంగా ఉండేటట్టు చీపుర్లు పట్టి మొత్తం ఊడ్చారు. పాఠశాలకు ఈకో ఫ్రెండ్లీ చెత్తబుట్టను ఇచ్చి పాఠశాలలో టాయిలెట్లను కూడా శుభ్రం చేయించారు. అంతకు ముందు టిలికాం సీజీఎం ఆఫీస్ నుంచి ఆంధ్రా విద్యాలయ ఉన్నత పాఠశాల వరకు స్వచ్ఛత ర్యాలీ నిర్వహించిన అనంతరం పాఠశాల ముందు మానవహారం నిర్వహించారు. చుట్టుపక్కల నివాసాలు, దుకాణాల వారు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టెలి కమ్యూనికేషన్ అకౌంట్స్ ఆఫీసర్ టి.భాను, ఉపాధ్యాయురాలు పి.హేమ పాల్గొన్నారు.

కట్టెలమండిలోని ఆంధ్రా విద్యాలయ ఉన్నత పాఠశాలలో మొక్కను నాటుతున్న టెలికమ్యూనికేషన్ తెలంగాణ సర్కిల్ కంట్రోలర్ అనిత

పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటాం..

సుల్తాన్‌బజార్,అక్టోబర్ 1 : పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని కింగ్‌కోఠి క్లస్టర్ ఎస్‌పీహెచ్‌వో, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ పేర్కొన్నారు. ఆదివారం కోఠి ఆర్ఎఫ్‌పీటీసీ యూపీహెచ్‌సీ ఆవరణలో స్వచ్ఛ తాహి సేవా క్యాంపెయిన్ నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఆమె, ఆర్ఎఫ్ పీటీసీ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రెడ్డితో కలిసి యూపీహెచ్‌సీ ఆవరణలో చీపురులను చేతబట్టి ఊడ్చారు. ప్రతి ఒక్కరితో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా తాము భాగస్వాములం అవుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ మాట్లాడుతూ.. ప్రతి నిత్యం ఇంట్లో పరిశుభ్ర పర్చుకునేలా తమ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా తమ వంతు బాధ్యత చేపట్టాలని పిలుపు నిచ్చారు. డెంగ్యూ, మలేరియా దరిచేరకుండా ప్రజలు స్వచ్ఛందంగా ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేంద్రీయ సదన్ లేబర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వెల్ఫేర్ కమిషనర్ కార్యాలయం నుంచి అసిస్టెంట్ వెల్ఫేర్ కమిషనర్ అభినవ్ తివారి, వెల్ఫేర్ అడ్మినిస్ట్రేటర్ ఈ.భీమేశ్వర్ రావు, ఎకనామిక్ ఆఫీసర్ బాలమురళి, కోఠి ఆర్ఎఫ్‌పీటీసీ యూపీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ నర్సుబాయి,

కోఠి ఆర్ఎఫ్‌పీటీసీ యూపీహెచ్‌సీ ఆవరణలో పరిసరాలను శుభ్ర పరుస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రెడ్డి

ఫార్మాసిస్ట్‌లు హేమ, తేజస్వి, డాటా ఎంట్రీ ఆపరేటర్ ఉషాశ్రీ, ల్యాబ్ టెక్నీషియన్ కవిత, ఏఎన్ఎంలు ఇందిరా,రాధ ,పద్మ,సుహాసిని, జయ, సునీత, ఆశ వర్కర్లు మాధవి,పుష్ప,అమరావతి,అను రాధ, లలిత, ఉమా,శ్రీదేవి,సబిత, జమున,లావణ్య,మహానం ద, దేవి, లిఖిత, సుజాత, వనజ, రత్నమాల, మహేశ్వరి, జి.లావణ్య, పి. లావణ్య పాల్గొన్నారు.

ధూల్‌పేట్‌లో.. దుర్గామాత విగ్రహాలు

అబిడ్స్, అక్టోబర్ 1 : దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా నగరంలో ఏర్పాటు చేయనున్న మండపాల్లో అమ్మవారి విగ్రహాలను నెలకొల్పనుండడంతో ధూల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో అమ్మవారి విగ్రహాల తయారీ కొనసాగుతోంది. ప్రతి సంవత్సరం వినాయక చవితి వరకు వినాయక ప్రతిమలను తయారు చేసి విక్రయాలు చేపట్టిన అనంతరం ధూల్‌పేట్ కళాకారులు దుర్గా మాత విగ్రహాల తయారీని ఆరంభిస్తారు. వేలాదిగా వినాయక ప్రతిమల తయారీ, విక్రయాలు జరుగగా అమ్మవారి విగ్రహాలు మాత్రం రెండు వేల వరకు తయారౌతాయి. గంగాబౌలి, శివలాల్‌నగర్, ధూల్‌పేట్ తదితర ప్రాంతాల్లో అమ్మ వారి విగ్రహాల తయారీ కొనసాగుతోంది. వినాయక చవితి పూర్తైన వెంటనే కళాకారులు అమ్మవారి విగ్రహాలకు తుది మెరుగులు దిద్దే కార్యక్రమంలో నిమగ్నమై ఉంటారు. ఆరు అడుగుల అమ్మవారి విగ్రహం నుంచి మొదలుకుని 15 అడుగుల విగ్రహాలను తయారు చేసే పనిలో కళాకారులు ఉన్నారు. 200 మంది పైగా కళాకారులు తయారీలో కేంద్రీకృతమై ఉన్నారు.

వివిధ రకాల రూపాలతో..

నవరాత్రోత్సవాలు అక్టోబర్ 15 నుంచి ప్రారంభం కానుండంతో వివిధ ప్రతిమలను తయారు చేసి విక్రయాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఐతే ఉత్సవాలు ప్రారంభం కావడానికి ఇంకా 15 రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో మండప నిర్వాహకులు ముందుగానే వస్తున్నారు. ఆర్డర్లు ఇస్తు ముందుగా తమవే తయారు చేయాలని కళాకారులకు సూచిస్తున్నారు.

కళాకారుల చేతిలో తుది మెరుగులు దిద్దుకున్న విగ్రహం

నేడు మొదటి మెట్రోపాలిటన్ వెయిట్ లిఫ్టింగ్ మీట్

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 1 : మొదటి మెట్రోపాలిటన్ వెయిట్ లిఫ్టింగ్ మీట్‌ను సోమవారం సుల్తాన్‌బజార్ హనుమాన్ వ్యాయామశాలలో నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.మైథిలీశరణ్ ఆదివారం తెలిపారు. తెలంగాణ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అనుబంధ సంస్థ ఐన హైదరాబాద్ డిస్ట్రిక్ట్ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మీట్‌లో 13 నుంచి 17 ఏండ్ల యూత్, జూనియర్ స్థాయిలో 15 నుంచి 20, సీనియర్స్, మాస్టర్స్ 15 నుంచి 35 ఏండ్ల వారు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ మీట్‌లో పాల్గొనే వారు ఎటువంటి ఎంట్రీ ఫీ కట్టనవసరం లేదని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ అజిత్ ఎక్‌బోటే,కార్యదర్శి బి.సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.